క్లుప్తంగా

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తుని: మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్.అన్నవరం పాఠశాల ప్రిన్సిపాల్ పి.యజ్ఞ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి చదివి ఉండాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ బాలురు మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాకినాడ జిల్లాలో తుని, పెద్దాపురం, కరపలో ఈ పాఠశాలలు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన బాలురు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వామివారి రథం ప్రారంభం

ఏలేశ్వరం: అనంతలక్ష్మి సమేత సత్యనారాయణస్వామి వారి రథాన్ని పట్టణంలో గురువారం ప్రారంభించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సిద్ధాంతి పండూరి నరసింహమూర్తి నూతనంగా తయారు చేసిన రథాన్ని స్థానిక పాత బస్టాండ్ వద్ద ప్రారంభించి, ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ బకాయిలపై నోటీసులు



తునిలో వ్యాపారులకు బకాయిల వివరాలను చెబుతున్న అధికారులు

తుని: పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రజా ఆరోగ్య శాఖాధికారి శేఖర్ కోరారు. గురువారం పట్టణంలో ఎక్కువ బకాయిలు ఉన్న షాపుల వద్దకు వెళ్లి, యాజమానులకు నోటీసులు జారీ చేశారు. 2024–25కు సంబంధించి వ్యాపారులు డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. వారం వ్యవధిలో బకాయిలను చెల్లించకపోతే పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ర్యాలీ

ఏలేశ్వరం: కేంద్రంలో ప్రధాని మోదీని గద్దె దించాలంటూ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏగుపాటి అర్జునరావు నాయకత్వంలో స్థానిక బాలాజీచౌక్, మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ కొనసాగింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు మాట్లాడుతూ కేంద్రంలో నియంతృత్వ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మానుకొండ లచ్చబాబు, సామిరెడ్డి నారాయణమూర్తి, కె జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తును మార్చే అస్త్రం ఓటు



సదస్సులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సిబ్బంది

జగ్గంపేట: ఓటు భవిష్యత్తును మార్చే అస్త్రమని, దీనిని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గురువారం మహిళలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలతో పాటు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి మహిళ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

కోటనందూరు: జగన్నాథపురంలోని హనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఉదయం 10.02 గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించారు. శాస్త్రోక్తంగా పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం శిఖర స్థాపన మహోత్సవం, శాంతి కల్యాణం జరిపించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



జిగేల్ మంటున్న ఓపెన్ ఆడిటోరియం



కండలు కావాలంటే జిమ్ చేయాల్సిందే..



ఐకానిక్ బోర్డు



ఆరోగ్యమే మహాభాగ్యం : ఓపెన్ జిమ్

తునికి మణిహారం

- నందనవనంగా రూపుదిద్దుకున్న పార్కు
- రూ.1.50 కోట్లతో అభివృద్ధి
- నేడు ప్రారంభించనున్న మంత్రి రాజా
- అందుబాటులోకి రానున్న అధునాతన సదుపాయాలు

తుని: పట్టణ ప్రజలు సేద తీరేందుకు అందమైన పార్కు అందుబాటులోకి వచ్చింది. గత పాలకులు నిర్లక్ష్యంతో పార్కులను పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రెండు పార్కులను రూ.3.25 కోట్లతో అభివృద్ధి చేశారు. ఇందులో రాజా రాజబాబు పార్కులో స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గణపతినగర్‌లో రూ.1.50 కోట్లతో పార్కును కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. దీనికి పొట్టి శ్రీరాములు మున్సిపల్ పార్కుగా నామకరణం చేశారు. శుక్రవారం ఈ పార్కును రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా లాంఛనంగా ప్రారంభించనున్నారు.



సుందరంగా రూపుదిద్దుకున్న గణపతినగర్ పార్కు

రూపు రేఖలు మారిన పార్కులు

పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో 18 పార్కులు ఉన్నాయి. వీటిలో ఒక్క పార్కునూ గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. దీంతో రోజంతా కష్టపడిన ప్రజలు సేదతీరడానికి అవకాశం లేకుండా పోయింది. ఇది గమనించిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మున్సిపల్ పాలకవర్గానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో రాజా రాజబాబు, గణపతినగర్ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. గణపతినగర్ పార్కును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేపట్టారు. గణపతినగర్ పార్కులో వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టులు, జిమ్, పిల్లలకు ఆట వస్తువులు, ఓపెన్ ఆడిటోరియం తదితర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఇది తుని పట్టణానికే ఐకాన్‌గా నిలవనుంది.

ప్రజల కోసమే అభివృద్ధి



పట్టణ ప్రజల కోసమే పాఠశాలలు, పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. గత ప్రభుత్వం చేయలేని పనిని మేం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మున్సిపల్ పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నేలా మార్పు చెందాయి. అన్ని రకాల వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు ఆహ్లాదం, వినోదం పంచడానికి గణపతినగర్ పార్కును మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతున్నాం. ఏ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి మా ప్రభుత్వ హయాంలో జరగడం ఆనందంగా ఉంది.

– ఏలూరి సుధారాణి, చైర్‌పర్సన్, తుని

పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు

ఏలేశ్వరం: తమ పార్టీ పతాకాన్ని అవమాన పరిచారంటూ గురువారం బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల తూర్పులక్ష్మీపురంలో బీజేపీ స్థూపాన్ని నిర్మించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. గుర్తు తెలియని వ్యక్తులు జెండాను పీకి పారేశారు. పార్టీ నాయకుడు చిలుకూరి రామ్‌కుమార్, మరికొందరు సంఘటన స్థలాన్ని పరిశీలించి, నిందితులను తక్షణం అరెస్టు చేయాలన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఐరన్, డీజిల్ చోరీపై కేసు

తొండంగి: మండలంలోని తమ్మయ్యపేట జాతీయ రహదారిపై లారీల నుంచి డీజిల్, ఐరన్ చోరీ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, హైవేపై ఐరన్, డీజిల్ చోరీ జరుగుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో వెళ్లి గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 400 కిలోల ఐరన్‌ను, 250 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

తొండంగి: దళితుల అభ్యున్నతి కోసం కృషి చేసిన అంబేడ్కర్ విధానాలను, ఆశయాలను సాధించుకునేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని బీఎస్పీ తుని నియోజకవర్గ అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని శృంగవృక్షంలో సమావేశం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

పేదల జీవితాల్లో వెలుగే జగన్ లక్ష్యం



కొత్తూరులో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- కొత్తూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

శంఖవరం: రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. గురువారం కొంతంగి పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, స్థానిక నేతలతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతిపక్షాలకు తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రజలకు మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్‌లు దూడల రామస్వామి ఈగల విజయదుర్గ, ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకులు గింజాల కొండబాబు, దూడల శివ, నేమాల సత్తిబాబు, గొర్లి నాగేశ్వరరావు, కొండపల్లి అప్పారావు, రాయపాటి అప్పారావు, యెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

పర్యవేక్షణకు సీసీ కెమెరాలు

ఏలేశ్వరం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్షలు శుక్రవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకూ జరగనున్నాయి. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాలతో పాటు, మూడు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 441 మంది, సెకండియర్ 309, గురుకుల కళాశాలలో ఫస్టియర్ 332, సెకండియర్ 351 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం నుంచి 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అర గంట ముందుగా చేరుకోవాల్సి ఉంది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలనూ ఏర్పాటు చేస్తున్నారు. తొలిసారిగా ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరు కానున్నారు.



ఏలేశ్వరం గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

సీసీ కెమెరాల ఏర్పాటు

తొలిసారిగా ఇంటర్మీడియెట్ పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాంపీయింగ్‌ను అరికట్టేందుకు పారదర్శకంగా, ప్రతి విద్యార్థి స్వేచ్ఛగా పరీక్షలు రాసేందుకు వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షల కోసం గురుకుల కళాశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా జయలక్ష్మి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా ఎ.ప్రతాప్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా కె.బాబ్జీ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పి.రామకృష్ణ వ్యవహరిస్తున్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: పోలియో మహమ్మారిని తరిమికొట్టడానికి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మార్చి మూడు నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ పల్స్‌పోలియో విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో వైద్య సిబ్బందికి సహకారం అందించాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే పల్స్‌పోలియోను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత పల్స్‌పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పల్స్‌పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, వైద్య సిబ్బంది

చివరి ఆయకట్టుకూ సాగు నీరు

- రైతులకు అధికారుల భరోసా
- బెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించిన ఆర్డీఓ, జేడీఏ

కిర్లంపూడి: రైతులకు చివరి ఆయకట్టు వరకూ నీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నామని అగ్రికల్చర్ జేడీ ఎన్ విజయకుమార్ అన్నారు. సింహాద్రిరాజు కాలువ ద్వారా కిర్లంపూడి, పిఠాపురం మండలానికి చెందిన సుమారు 18 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు సరఫరా అవుతోంది. సింహాద్రిరాజు కాలువకు ఒడ్డు వేసి పాపాయిరాజు కాలువకు నీరు మళ్లించడంతో, దిగువ ఆయకట్టుకు సరిపడా సాగునీరు అందడం లేదని రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గెద్దనాపల్లిలో ఏలేరు కాలువ నుంచి సింహాద్రిరాజు కాలువ బెడ్ రెగ్యులేటర్‌ను జేడీ ఎస్.విజయ్‌కుమార్, పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు గురువారం పరిశీలించారు. స్థానిక రైతులతో సమీక్ష నిర్వహించి, సాగునీటి సరఫరా సమస్యను తెలుసుకున్నారు. గతంలో ఏలేరు కాలువ నుంచి నేరుగా పాపాయిరాజు కాలువ ద్వారా గెద్దనాపల్లి, రామకృష్ణాపురం, చిల్లంగి గ్రామాల్లో 800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేదని, సింహాద్రిరాజు కాలువ ఆధునీకరణ పనుల్లో భాగంగా పాపాయిరాజు కాలువ పూర్తిగా మట్టిలో కూరుకుపోయిందన్నారు. దీంతో సింహాద్రిరాజు కాలువకు ఒడ్డు వేసి, సాగునీరు పాపాయిరాజు కాలువకు మళ్లిస్తున్నారని స్థానిక రైతులు వారికి తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాపాయిరాజు, సింహాద్రిరాజు కాలువలపై ఉన్న ఆయకట్టు రైతులకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా వాటర్ ఫ్లో పెంచినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ డీవీ రామ్‌గోపాల్, ఏడీ ఎన్.దైవకుమార్, ఏఈ ఎస్ శ్రీనివాసకుమార్, ఏఓ జోకా అమృత ఉన్నారు.



గెద్దనాపల్లిలో బెడ్ రెగ్యులేటర్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న విజయకుమార్

సంక్షేమ పాలనకు ఓటేయండి



కార్యక్రమానికి హాజరైన గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల

ప్రత్తిపాడు: సంక్షేమ, అభివృద్ధి పాలనకు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఏ ప్రభుత్వ హయాంలో మేలు జరిగిందో బేరీజు వేసుకోవాలన్నారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం సాయంత్రం సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వెంకటరత్నం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అర్హత ఉండి, పథకం అందని వారెవరైనా ఉంటే ప్రశ్నించాలన్నారు. తాము అధికారంలోకి వచ్చి, శంకుస్థాపనలే కాకుండా.. అంతకుమించి ప్రారంభోత్సవాలు కూడా చేస్తున్నామని ప్రజలు గుర్తించాలన్నారు. వైఎస్సార్ సీపీ ఏం చేసిందో చెప్పగలిగే సత్తా తమకుందన్నారు. సంక్షేమ ఫలాలు నిష్పక్షపాతంగా, అర్హులందరికీ అందాలంటే తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు.

ప్రతి కుటుంబంలో ఆర్థికాభివృద్ధి

విశిష్ట అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు) మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలనూ ఆదుకుంటున్నారని, ఈ ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వరుపుల సుబ్బారావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ప్రత్తిపాడు, శంఖవరం మండలాల పార్టీ కన్వీనర్లు రామిశెట్టి బులిరామకృష్ణ, నరాల శ్రీను, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, జేసీఎస్ కన్వీనర్ గొల్లపల్లి దొరబాబు, పార్టీ నాయకులు ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, సచివాలయ కన్వీనర్లు వాసా రాజు, చిట్టిబాబు, మోర్త విజయ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..



రౌతులపూడిలో వరుపుల సుబ్బారావు, చలమలశెట్టి సునీల్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్లు చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ వచ్చేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన రౌతులపూడిలో పార్టీ నాయకుడు వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా స్థానిక మార్కెట్ సెంటర్‌లోని బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేడ్కర్, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు గజమాలతో వారిని సత్కరించారు. అనంతరం మార్కెట్ సెంటర్ నుంచి కోటవీధి మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయం, బీసీ కాలనీ మీదుగా పర్యటించారు. ఇంటింటికీ తిరిగి గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, సర్పంచ్‌లు సర్నం శ్రీను, సైపురెడ్డి వెంకటరమణ, మిరియాల చిట్టిబాబు, నాయకులు యామన సురేష్‌బాబు, కోఆపరేటివ్ డైరెక్టర్ బండారు బైరాగి తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండండి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

శంఖవరం: దళిత వాడల్లో విద్యార్థులు, యువత వివాదాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో గురువారం ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమాజ హితం కోసం నిర్వహించే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. దళిత విద్యార్థులు, యువకులు ఉన్నత చదువుల్లో రాణించి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. వివాదాలు, అల్లర్ల జోలికి వెళ్లరాదని సూచించారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుంటే జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. దళిత చిన్నారులు, విద్యార్థులు, యువత నడుమ ఎస్పీ కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సమకూర్చిన రూ.లక్ష విలువైన వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులు, యువకులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్సై ఐ.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



శంఖవరం దళితవాడలో కేక్ కట్ చేసి చిన్నారికి తినిపిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

శాంతి స్థాపనలో యువత పాత్ర కీలకం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు, హెచ్‌ఎం

తుని రూరల్: ప్రపంచ శాంతి నెలకొల్పడంలో యువత పాత్ర కీలకమైందని తుని రోటరీ క్లబ్ కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి అన్నారు. గురువారం తుని మండలం ఎస్.అన్నవరంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి–యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, సౌభ్రాతృత్వంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. క్లబ్ సేవలు గ్రామాలకు విస్తరిస్తున్నామన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు డీవీ రాజు, సీహెచ్ మంగరాజు, ఎస్.నాగభూషణం, ఎన్.వీర్రాజు, డాక్టర్ నాగిరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యచంద్రపై నేతల ఆగ్రహం

జగ్గంపేట: జనసేన టిక్కెట్ కోసం ఆశించి భంగపడ్డ సూర్యచంద్ర ఆరోగ్యం బాగా లేకపోయినా, డిప్రెషన్‌తో ఉన్నా తక్షణం డాక్టర్‌కు చూపించుకోవాలని పలువురు టీడీపీ నేతలు, సూర్యచంద్ర సోదరుడు సూచించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ నేతలు ఎస్‌వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, భద్రం, సూర్యచంద్ర సోదరుడు పాటంశెట్టి బాబ్జీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. టిక్కెట్ రాలేదన్న ఆవేశంతో సూర్యచంద్ర తమ నాయకుడు జ్యోతుల నెహ్రూపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. టిక్కెట్ల కోసం అందరూ ప్రయత్నాలు చేసి ఉంటారని, కొంతమందికి పొత్తుల నేపథ్యంలో రాకపోయినా హుందాగా వ్యవహరించాలని తెలిపారు. జనసేన రాజమండ్రి రూరల్ టిక్కెట్ రాకపోయినా కందుల దుర్గేష్ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేస్తున్నారని, ఆయన్ని చూసైనా సూర్యచంద్ర తన పద్ధతి మార్చుకోవాలన్నారు.

రైలు నుంచి పడిపోయిన లగేజి

వెలికితీసి అప్పగించిన రైల్వే పోలీసులు

అన్నవరం: బెంగళూరుకు చెందిన ప్రయాణికులు అన్నవరం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కే ప్రయత్నంలో బ్యాగ్‌ను ట్రాక్‌పై జారవిడుచుకున్నారు. దీంతో సామరవారి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు ఆ బ్యాగ్‌ను వెలికితీసి, తిరిగి వారికి అందచేశారు. బెంగళూరుకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగిని మంజులాదేవి దంపతులు గురువారం సత్యదేవుని దర్శనం చేసుకుని, తిరుగు ప్రయాణంలో ఉదయం 11 గంటలకు బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. రైలు ఎక్కే కంగారులో వారి బ్యాగ్ ట్రాక్‌పై పడిపోయింది. రైలు ముందుకు కదిలిపోవడంతో, బ్యాగ్ తీసుకునే వీల్లేకపోయింది. దీంతో వారు సామర్లకోట రైల్వేస్టేషన్ చేరుకున్నాక, అక్కడి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు అన్నవరం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. తుని రైల్వే ఎస్సై అబ్దుల్ మారూఫ్ ఆదేశాలతో అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు ఆ బ్యాగ్‌ను వెలికితీశారు. గురువారం సాయంత్రం సామర్లకోట నుంచి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో అన్నవరం రైల్వేస్టేషన్‌కు వచ్చిన మంజులాదేవి దంపతులకు ఆ బ్యాగ్‌ను అప్పగించారు.



మంజులాదేవి దంపతులకు బ్యాగ్ అప్పగించిన రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు